ఎన్నికల విధులు పారదర్శకంగా నిర్వహించాలి

● కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

పీఓ, ఏపీఓల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, ఏప్రిల్ 1 : ఎన్నికల విధులు, బాధ్యతలు సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. సోమవారం సూర్యాపేట నియోజకవర్గానికి చెందిన పీఓ, ఏపీఓలకు స్థానిక ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో పీఓ, ఏపీఓలకు ఎన్నికల రోజున నిర్వహించే విధి విధానాలపై రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలని చెప్పారు. నాలుగు నియోజకవర్గాల పరిధిలో 1,416 మంది పీఓలు, ఏపీఓలకు గాను మొదటి రోజు 1,188 మంది సిబ్బంది శిక్షణ కార్యక్రమానికి హాజరైనట్లు చెప్పారు. మొదటి రోజు హాజరు కాని 228 మంది సిబ్బంది రెండో రోజు శిక్షణ కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్, తాసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, డీపీఓ శ్రీధర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్లు లక్ష్యాలను అందిపుచ్చుకోవాలి

● మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జయలత

హౌస్ సర్జన్స్‌లో ప్రవేశిస్తున్న జూనియర్ డాక్టర్లతో డీఎంహెచ్ఓ కోటాచలం

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 1 : జూనియర్ డాక్టర్లు అవసరమైన నైపుణ్యాలను నేర్చుకుని అనుకున్న లక్ష్యాలను అందిపుచ్చుకుని ఆకాంక్షలను నెరవేర్చుకోవాలని సూర్యాపేట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయలత అన్నారు. సూర్యాపేట మెడికల్ కళాశాలలో 2019 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులు ఫైనల్ ఇయర్‌లో ఉత్తీర్ణులై హౌస్ సర్జన్స్‌లో ప్రవేశిస్తున్నందున ఏర్పాటు చేసిన ఇండక్షన్ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 2019 బ్యాచ్‌కు చెందిన 135 మంది జూనియర్ వైద్యులుగా ఉత్తీర్ణులు కావడం పట్ల అభినందనలు తెలిపారు.

కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేశ్, ఆర్థోపెడిక్స్ డాక్టర్ గిరిధర్‌నాయక్ పాల్గొన్నారు.

5కే రన్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ అశోక్

ఓటు ఆవశ్యకతను తెలుసుకోవాలి : డీఈఓ అశోక్

సూర్యాపేట, ఏప్రిల్ 1 : ప్రజాస్వామ్యంలో ఓటు ఆవశ్యకతను అంతా తెలుసుకుని అర్హులు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డీఈఓ, జిల్లా స్వీప్ నోడల్ అధికారి అశోక్ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ నుంచి సద్దల చెరువు వరకు నిర్వహించిన 5కే రన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నూతనంగా ఓటు హక్కు వచ్చిన యువతీయువకులు తమ హక్కును వినియోగించుకోవాలన్నారు. మంచి పరిపాలన కావాలంటే మన ఓటుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తాసీల్దార్ శ్యామ్ సుందర్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల మున్సిపాలిటీలో నూతనంగా నిర్మించిన ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి

● ఆర్డీఓ శ్రీనివాసులు

నేరేడుచర్ల, మార్చి 1 : నేరేడుచర్ల పట్టణ ప్రజలకు మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 6, 8 వార్డులో కొనసాగుతున్న పైపులైన్ల పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్నందున భూగర్భ జలాలు అడుగంటి నీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉన్నదన్నారు. మంచినీటి సరఫరా పైపు లైన్లు, చెడిపోయిన బోరింగ్‌లు, మోటర్ల మరమ్మతులను తక్షణమే చేపట్టాలన్నారు. అవసరమైతే వాటర్ ట్యాంక్ ద్వారా నీటి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, ఏఈ స్వాతి, సిబ్బంది ఉన్నారు.

ఈగా దయాకర్‌గుప్తాను సన్మానిస్తున్న ఆర్యవైశ్య మహాసభ నాయకులు

సామాజిక సేవకుడు ఈగా దయాకర్‌కు సన్మానం

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 1 : సదాచార్ ట్రస్ట్ కన్వీనర్ దయాకర్‌గుప్తా కాశీ విశ్వేశ్వరస్వామి ఆర్యవైశ్య వాసవీ నిత్యాన్నదాన సత్రం వారణాసి ట్రస్ట్ కమిటీలో జాయింట్ సెక్రటరీగా నియమితులైన సందర్భంగా సోమవారం ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష, కార్యదర్శులు మిర్యాల శివకుమార్, బొల్లం సురేశ్, కోశాధికారి గుడిపాటి రమేశ్, సభ్యులు నూకా వెంకటేశంగుప్తా, నరేంద్రుణి విద్యాసాగర్, పబ్బా ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● అదనపు కలెక్టర్ లత

తుంగతుర్తి : వెలుగుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ లత

తుంగతుర్తి, ఏప్రిల్ 1 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్.లత అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెలుగుపల్లి శివారులో కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చినట్లయితే ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,203 ధర పలుకుతుందన్నారు. జిల్లాలో మొత్తం 236 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఇప్పటి వరకు 72 కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. ఎండ తీవ్రంగా ఉన్నందున రైతులకు సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్ఓ మోహన్‌బాబు, తాసీల్దార్ చామల రమణారెడ్డి, ఎంపీడీఓ భీమ్‌సింగ్‌నాయక్, ఐకేపీ ఏపీఎం నర్సయ్య, ఇన్‌చార్జి సీసీ నర్మదా పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంతో పాటు గోరెంట్ల స్టేజీ వద్ద మండల సమాఖ్య, సంఘ బంధం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్‌డీఏ ఏపీడీ సురేశ్ ప్రారంభించారు. ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, తాసీల్దార్ అమీన్‌సింగ్, ఏఓ వికాస్ పాటిల్, ఏపీఎం మైసయ్య పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఏపీఎం అజయ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని మహ్మదాపురం, అనాజీపురం గ్రామాల్లో మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. ఏఓ కృష్ణసందీప్, ఏఈఓ రేణుక, సీసీ చెన్నయ్య, కార్యదర్శులు నాగేశ్వర్‌రావు, జానీ, వీఓఏలు ధనలక్ష్మి, విజయ, నీరజ, సుమతి, ఇందిరమ్మ, లక్ష్మి, మమత, కళమ్మ పాల్గొన్నారు.

నాగారం : మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తాసీల్దార్ బ్రహ్మయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం తరాల శోభారాణి, సీసీ రామయ్య, వీఓ కడియం విజయలక్ష్మి పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లి, జాజిరెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం వలిశెట్టి మల్లేశ్ ప్రారంభించారు. ఆర్ఐ వెంకటఖరెడ్డి, సీసీలు నగేశ్, పద్మావతి, సంఘ బంధం అధ్యక్షులు సునీత, కరుణశ్రీ, రమణ, వీఓఏలు కృష్ణకుమారి, సురాంభ, పద్మ, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, శిగ నసీర్‌గౌడ్, దాసరి సోమయ్య పాల్గొన్నారు.

మోతె : మండల పరిధిలోని ఉర్లుగొండ, తుమ్మగూడెం గ్రామాల్లో పీఏసీఎస్ సర్వారం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈఓ ఉయ్యాల కార్తీక్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈఓ దోసపాటి ఉపేందర్ పాల్గొన్నారు.

చిలుకూరు : చిలుకూరులోని సంఘ బంధం ఆధ్వర్యంలో ఐకేపీ కేంద్రాన్ని తాసీల్దార్ దవకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం దుర్గాప్రసాద్, ఆర్ఐ సీతయ్య, మంజుల, సిబ్బంది గురుమూర్తి, కోటేశ్వరి, వీఏఓలు, రైతులు పాల్గొన్నారు.

తాపీ పనివార్ల సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 1 : ఇటీవల బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికైన సూర్యాపేట డివిజన్ తాపీ పనివార్ల సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని సోమవారం ఆ సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి హాజరై నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలకు అతీతంగా కార్మికులంతా కలసికట్టుగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. అనంతరం సంఘం గౌరవాధ్యక్షుడిగా గుత్తి నగేశ్, అధ్యక్షుడిగా రెబల్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రావణ్, సహాయ కార్యదర్శిగా రవి, కోశాధికారిగా భిక్షంగౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు.

నల్లగొండకు తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ నుంచి తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

గరిడేపల్లి : నల్లగొండకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

గరిడేపల్లి, ఏప్రిల్ 1 : నల్లగొండలో సోమవారం జరిగిన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పలు వాహనాల్లో పార్టీ మండలాధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్ ఆధ్వర్యంలో తరళివెళ్లారు. తరలివెళ్లిన వారిలో సర్వారం పీఏసీఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి, నాయకులు ఇసాక్, ముకలపల్లి రవి, చామకూరి అంజి, సైదానాయక్, నల్లపాటి భాస్కర్, గాలి రామకృష్ణ, నకిరేకంటి ప్రసాద్ ఉన్నారు. పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ నాయకుల విస్తృత సమావేశానికి హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వారిలో జడ్పీటీసీలు కొప్పుల సైదిరెడ్డి, జగన్‌నాయక్, పార్టీ నాయకులు బెల్లకొండ అమర్, నగేశ్‌రాథోడ్, తండు సాయిరాం, రాంబాబు, చెవుల కవిత, బసవయ్య, పాలేటి రామారావు, భిక్షం ఉన్నారు.

జాన్‌పహాడ్ లిఫ్ట్ పనుల పరిశీలన

గుండెబోయినగూడెం గ్రామంలో జాన్‌పహాడ్ లిఫ్ట్ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ గోపాల్

పాలకవీడు, ఏప్రిల్ 1 : మండలంలోని గుండెబోయిన గూడెం గ్రామంలో కృష్ణానదిపై రూ.118.70 కోట్ల అంచనాతో నిర్మాణం జరుగుతున్న జాన్‌పహాడ్ లిఫ్ట్ పనులను ఎంపీపీ గోపాల్ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గోపాల్ మాట్లాడుతూ.. ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే పాలకవీడు మండలంలో పలు గ్రామాలు సశ్యశ్యామలం అవుతాయని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి ఈ లిఫ్ట్ పథకాన్ని విస్తరింపచేసి మరిన్ని గ్రామాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, మోతీలాల్, నర్సింహారావు, సైదా పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

మద్దిరాల, ఏప్రిల్ 1 : పశువులకు సోకే గాలికుంటు వ్యాధి పట్ల రైతులు జాగ్రత్తలు వహించాలని మండల పశు వైద్యాధికారి అసిఫాబేగం అన్నారు. సోమవారం మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి మాట్లాడారు. పశువులకు డెక్కల్లో పుండ్లు కావడం, మూతి, నాలుకపై పుండ్లు ఏర్పడడం వ్యాధి లక్షణాలుగా గుర్తించాలని సూచించారు.

రెడ్డిగూడెం గ్రామంలో టీకాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా పశు వైద్యాధికారి కుమారస్వామి పరిశీలించారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీస్, రెవెన్యూ, ప్రత్యేక బలగాలు

మఠంపల్లి, ఏప్రిల్ 1 : మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వీరాంజనేయులు మాట్లాడుతూ.. ప్రజలు తమ అవసరాలకు తీసుకెళ్లే నగదు రూ.50 వేలకు మించి ఉండరాదన్నారు. రసీదు లేని డబ్బులు సీజ్ చేయడం జరుగుతుందని వివరించారు.

'ముందస్తు పన్ను చెల్లింపులకు 5 శాతం మినహాయింపు'

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 1 : సూర్యాపేట పట్టణ గృహ, వ్యాపార, వాణిజ్య యజమానులు 2024-25 ఆర్థిక సంవత్సరం పన్నును ఏప్రిల్ 30లోపు చెల్లించిన వారికి 5 శాతం మినహాయింపు ఇవ్వడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సంబంధిత బిల్ కలెక్టర్లకు గానీ లేదా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో తమ పన్నులను చెల్లించి రసీదు పొందాలని సూచించారు.

వేంకటేశ్వర ఆలయంలో ఈ 4న బహిరంగ వేలం

జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 4న గురువారం ఉదయం 10 గంటలకు దేవాలయ ప్రాంగణంలో కొబ్బరికాయలు అమ్ముకునేందుకు, తలనీలాలు సేకరించేందుకు ఏడాది కాలానికి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వై.శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు దేవాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని వివరాలకు 9866025576 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

104 ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

● సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, ఏప్రిల్ 1 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 104 ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 104 ఉద్యోగులు ఏండ్లుగా చాలీచాలని జీతాలతో అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. ఏడు నెలలుగా జీతాలు లేక వారి కుటుంబాలు పస్తులుండే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, ఏఐఎస్ఎఫ్ నాయకుడు కొమ్రరాజు వెంకట్ పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిదే గెలుపు

● ఆప్ జిల్లా అధికార ప్రతినిధి మురళీధర్‌రెడ్డి

తిరుమలగిరి, ఏప్రిల్ 1 : లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిదే గెలుపు అని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుంపల మురళీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఏర్పాటు చేసిన ఇండియా కూటమి సభ విజయవంతం అయిందని, ప్రజలు ఇండియా కూటమిని గెలిపించాలని భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహేశ్, సోమన్న పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అర్వపల్లి, ఏప్రిల్ 1 : మండలంలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన కేసాని నరసింహరావు కొడుకు నితిన్ ఇటీవల మరణించాడు. మున్నూరు కాపు స్ఫూర్తి సంఘం తరుపున సోమవారం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని నితిన్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆకుల సోమేశ్, కోనేటి వెంకట్, జానకి రామ్, సుధాకర్, రాంబాబు, లింగయ్య పాల్గొన్నారు.

సైబర్ వారియర్స్‌కు మొబైల్ ఫోన్స్ అందజేస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

పోలీస్ సైబర్ వారియర్స్‌కు మొబైల్ ఫోన్లు

● ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, ఏప్రిల్ 1 : జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పోలీస్ సైబర్ వారియర్స్ పని చేస్తుండగా వారికి సోమవారం సైబర్ వారియర్స్ హెల్ప్‌లైన్ నంబర్లను, మొబైల్ ఫోన్లను ఎస్పీ రాహుల్ హెగ్డే జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న సాంకేతికతతో పాటు సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసి ఆర్థిక నష్టాన్ని కలిగిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వారు 1930 జాతీయ టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. సైబర్ నేరాల ఫిర్యాదులు, కేసుల స్థితిగతులను తెలుసుకునేందుకు వీలుగా అన్ని పోలీస్‌స్టేషన్లలో పోలీస్ సైబర్ వారియర్స్‌కు నూతన హెల్ప్‌లైన్ నంబర్లు, ఫోన్స్ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ వారు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేశ్‌మీనా, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్‌రావు, సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, సైబర్ సెక్యూరిటీ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో నెల రోజులు పోలీస్ యాక్ట్ అమలు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా ఏప్రిల్ 1 నుంచి 30 వరకు నెల రోజుల పాటు సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉంటుందని ఎస్పీ రాహుల్ హెగ్డే ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేనిదే జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ప్రజావాణికి 7 ఫిర్యాదులు

జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 7 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. పోలీస్ పరిధిలో ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. అనంతరం పదవీ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ జార్జ్‌ను ఎస్పీ సన్మానించారు.

నేడు తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు సెలవు

తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు భారీగా వచ్చిన వరి ధాన్యం

తిరుమలగిరి, ఏప్రిల్ 1 : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం భారీగా వరి ధాన్యం రావడంతో మంగళవారం మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు కార్యదర్శి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాసంగి సీజన్‌లో తొలిసారిగా అత్యధికంగా 20,488 బస్తాల ధాన్యం 298 మంది రైతులు తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఇందులో ఆర్ఎన్ఆర్ రకం 603 బస్తాలు రాగా గరిష్ట ధర 2,139, కనిష్ట ధర 2,002, మధ్యరకం ధర 2,059 ధర పలికింది. ఐఆర్64 రకం 19,650 బస్తాల ధాన్యం రాగా గరిష్ట ధర రూ.1,997, కనిష్ట ధర 1,620, మధ్యరకం ధర క్వింటాకు 1,889 పలికింది. అలాగే ఎస్.ఎం రకం ధాన్యం 235 బస్తాలు రాగా గరిష్ట ధర రూ.2,039, కనిష్ట ధర 1,929, మధ్యరకం ధర 2,021 పలికినట్లు పేర్కొన్నారు.

వైభవంగా 'మై హోం' వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం

క్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించి రామేశ్వర్‌రావు దంపతులకు అందిస్తున్న చినజీయర్ స్వామి

మేళ్లచెర్వు, ఏప్రిల్ 1 : మేళ్లచెర్వులోని మై హోం ఇండస్ట్రీస్ ఆవరణలో కొలువై ఉన్న శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. ఈ వేడుక త్రిదండి చినజీయర్ స్వామి, అహోబిల రామానుజ జీయర్ స్వాముల ప్రత్యక్ష పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా సాగింది. పరిశ్రమ చైర్మన్ జూపల్లి రామేశ్వర రావు-శ్రీకుమారి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. త్రిదండి చినజీయర్ స్వామి భక్తులనుద్దేశించి మాట్లాడుతూ భగవంతుడిపై విశ్వాసం ఉంచితే ప్రతి మనిషి శాంతమైన జీవితాన్ని పొందుతాడని పేర్కొన్నారు. అనంతరం క్రోధి నామ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మునగాల రామ్మోహన్‌రావు-అరుణ, యూనిట్ హెడ్ శ్రీనివాస్‌రావు, హెచ్ఆర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాజగోపాల్, నల్లగొండ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, మైహోం కుటుంబ సభ్యులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఫిట్ ఇండియా క్విజ్ జాతీయ పోటీలకు తేజ విద్యార్థులు

జాతీయ స్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైన తేజ విద్యార్థులు

కోదాడ రూరల్, ఏప్రిల్ 1 : భారత ప్రభుత్వ క్రీడా సాధికార సంస్థ, కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పాఠశాల స్థాయి విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో తేజ పాఠశాల విద్యార్థులు పల్లా హృతిక్ (10వ తరగతి), కొండ్ర నవీన్‌కుమార్ (9వ తరగతి) జట్టు ప్రథమ స్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి సోమవారం తెలిపారు. ఫైనల్ క్విజ్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించగా తమ పాఠశాల విద్యార్థులు నూరు మార్కులు సాధించి ప్రథమ స్థానం పొంది రూ.2.50 లక్షల నగదు బహుమతిని సాధించినట్లు చెప్పారు. విజేతలు ఈ నెల చివరి వారంలో న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి ఫైనల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరుపున పాల్గొంటారని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి ఒలంపియాడ్‌లో కోదాడ విద్యార్థి ప్రతిభ

కోదాడ రూరల్, ఏప్రిల్ 1 : ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన ఒలంపియాడ్ పరీక్షలో పట్టణానికి చెందిన నెమ్మాది శ్రీహాన్ ఉత్తమ ప్రతిభ చూపి 7వ స్థానం సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విజేతకు సోమవారం రవీంద్ర భారతి ఆడిటోరియంలో కౌన్సిల్ ఫర్ నర్చరింగ్ అకాడమిక్ పొటెన్షియల్ ఇన్ స్టూడెంట్స్ వారు మెమోంటో, సర్టిఫికెట్ అందించారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి

● సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్

కీతవారిగూడెంలో మాట్లాడుతున్న యాకూబ్

గరిడేపల్లి, ఏప్రిల్ 1 : త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకూబ్ అన్నారు. మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో సోమవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, కార్మికులు, నిరుద్యోగులకు తగిన న్యాయం జరుగాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు. సమావేశంలో నాయకులు తుమ్మల సైదయ్య, రామస్వామి, శ్రీనివాస్, వెంకయ్య, మట్టయ్య పాల్గొన్నారు.